# కాలం కబళిస్తోంది

"ఇదే సారి పెనుమూడి : ఆ కనిపించేదే కృష్ణ. తమరు వెళ్ళాల్సిన 'లంక', ప్రవాహానికి ఎదురుగా, సరిగ్గా మూలగా వుంది. కానీ.... కానీ...." నాగభూషణం, నేను, కారు దిగగానే, డ్రైవరు వెంకటాద్రి చెప్పిన మాటలివి.

"కానీ ఏమిటి ?" గర్జించాడు నాగభూషణం.

ముఖం చిట్లించుకుని మెల్లగా అన్నాడు వెంకటాద్రి. "అట్లాచూడండి, నల్లటి మబ్బులు గుంపుగా వస్తున్నాయి. కాస్సేపట్లో చినుకులు వచ్చేలా వుంది. వాన పెద్దదైతే మధ్యలో ఇబ్బంది పడతారు. పడవలకు 'టాప్' కూడా వుండదు...."

"డామిట్ ! ఇంత దూరం వచ్చి, వెధవ చినుకులకు భయపడి వెనక్కి తిరిగి వెళ్ళడమా ? అసంభవము!"

జమీందారీలు పోయి దశాబ్దాలు మారినా, జమీందార్ హోదా తగ్గని మాజీ జమీందార్ బిడ్డ నాగభూషణం, కలిమిలో పుట్టి, విలాసాలలో పెరిగిన అతగాడికి కష్టాలనే మాటకు అర్థంకూడా తెలియదు !

"పోనీండి ! మరోమారు వద్దాం !" పడగనీడను బ్రతుకుతున్న కప్పలా ! నాగభూషణం దగ్గర మేనేజరుగా

వున్న నేను, అతగాడితో ఎక్కువ చనువుగా ఈనాటికీ మాట్లాడలేను !

"ఏం శ్రీనివాస్ ? నీకూ నీళ్ళంటే భయమా ఏమిటి ? ఏం మగాడివోయ్ !" హేళనగా చూశాడు నావేపు! నాలో రోషం బుస్సుమంది.

"అవసరమైతే, ఈ ఒడ్డునుంచి ఆఒడ్డువరకూ ఈత కొడుతూ వెళ్ళగలను. కానీ వర్షం వచ్చేలా వుంటే...." కోపంతో కంపిస్తున్న నా కంఠస్వరం నాకే కటువుగావుంది.

"ఓహ్ ! వెధవ్వాన ! ఏం చేస్తుంది ? రెయిన్ కోట్లు వున్నాయిగా ?

ఏమిటోయ్ వెంకటాద్రీ ! అలాగే నిల్చున్నావ్ ? త్వరగా వెళ్ళి ఓ పడవ సిద్ధం చేయించు...." ఆజ్ఞాపించాడు. వెంకటాద్రి కదిలివెళ్ళాడు గుడిశెలకేసి.

ఆ సరికే, చుట్టు ప్రక్కల గుడిశెలలోని స్త్రీలూ, పిల్లలూ, వృద్ధులూ గుమిగాచేరి కారుకేసి వింతగా చూస్తున్నారు. కిళ్ళీ బంకులోని వాళ్ళూ ఆశ్చర్యంగా పరికిస్తున్నారు. నాగభూషణం వాలకాన్ని బట్టి, బంగారు పిచ్చుక అని గ్రహించుకున్నాడు కాబోలు, అందులో ఓ బంకు యజమాని అతివినయం ఒలకబోస్తూ మా దగ్గరగా వచ్చాడు.

"ఇట్లావచ్చి మా బంకులో కూర్చోండి బాబూ !" అన్నాడు.

ఇష్టం లేకున్నా అంగీకరించాడు నాగభూషణం, కారణం మేం నిల్చునివున్న చోటంతా, క్రితంరోజు వర్షం కురిసింది కాబోలు, బురదగా, చితచిత లాడుతూ, చిరాకు కలిగిస్తోంది. బంకు మీదున్న రేకును మరికాస్త ముందుకు లాగి, రెండు బొంగులు ఆసరాగా నిలబెట్టాడు బంకు యజమాని. అక్కడేవున్న పొడుగుపాటి బల్లమీద కూర్చున్నాం ఇద్దరం! ఎవరో పల్లెటూరి యువతి ఆకులకోసం వచ్చింది బంకులోకి....

నాగభూషణం నావేపు చూచి కన్ను గీటాడు. "బావుందికదూ?" అన్నట్లుగా.

నా కేమిటో తగని అసహ్యం కలిగింది! అసలే అయిష్టంగా బయల్దేరిన ఈ నాటి ప్రయాణమూ, రాబోయే వాన, లంకలో నే చూడవలసిన ఘట్టాలూ, కలగాపులగంగా నా హృదయంలో నాగభూషణంపై నాకున్న ఏహ్యాభావాన్ని మరింత పెంచుతున్నాయి! దానికి తోడు కనిపించిన ఆడదాని వల్లా అనుభవించాలనే నాగభూషణం నైతిక వక్రత మరింత జుగుప్సాకరంగా వుంది.

ఆ అమ్మాయి ఆకులు, వక్కలు తీసుకుంటూ ఏదో మాట్లాడ్తోంది బంకు యజమానితో. నాగభూషణం నాచెవిలో మెల్లిగా అన్నాడు. "మనిషి చాలా బావుంది? గానీ.... ఈ పల్లెటూరి యువతుల్లో పరిశుభ్రత తక్కువగా వుంటుందోయ్ శ్రీనివాస్! డెట్టాల్ వగైరా ఆంటీ సెప్టిక్ లోషన్స్‌లో

వీళ్ళని ముంచాకగానీ—వేలేసి ముట్టుకోవడానికి అర్హత రాదు...."

చటుక్కునలేచి కట్టమీదకు వచ్చాను. నీళ్ళు మెట్ల అంచుల వరకూ వచ్చివున్నాయి. అలలు అలలుగా ఉధృతంగా వస్తున్న నీటిమీద నురగ తేలివచ్చి తెల్లని బంతిలా తయారౌతోంది. అక్కడే, ఇనప దిమ్మెకు కట్టివున్న మోకులు, నీటిలోకి దిగవేసిన పడవలు, సన్నని గాలికి నీటిమీద తమాషాగా తిరుగుతున్నాయి అక్కడి కక్కడే!

"ఇదుగో బాబూ! పడవ మనుషులు!" వెంకటాద్రి గొంతువిని తిరిగి చూచాను, ఏభై సంవత్సరాలు పైబడ్డ వృద్ధుడొకడు, మాంఛి నడివయసులోవున్న బలిష్ఠులైన యువకులు ఇద్దరు, నిల్చుని వున్నారు.

"పోనూ, రానూ, ఐదురూపాయలడుగు తున్నారు...." అన్నాడు వెంకటాద్రి నాగభూషణంతో!

"వానొచ్చే లావుంది, దొరా........తొరగా చేరాలిగా?" నసిగాడు వృద్ధుడు. "ఓస్ అంతేనా? ఇదుగో తీసుకో....మేం లంకలో పని ముగించుకువచ్చే వరకూ మీరు కాచుకుని ఉండాలి. తెలిసిందా?" ఐదురూపాయల నోటు వృద్ధుడి వేపు గిరవాటు వేశాడు నాగభూషణం! అతగాడి కళ్ళు క్షణకాలం మెరిశాయి!

"కాస్సేపు కూర్చోండి దొరా! పడవ విప్పుకొని పిలుత్తాం!" ముగ్గురూ గబగబా మెట్లుదిగి పడవదగ్గరకు వెళ్ళారు!

"ఏమిటోయ్ శ్రీనివాస్ ఆలోచనా? రెయిన్ కోటు తీసుకున్నావా నీది? అధికార పూర్వకంగా అడిగాడు నాగ భూషణం.

తలూపాను.

"వెంకటాద్రీ! మేమెంత పొద్దుపోయాకైనా తిరిగి వస్తాం! కాసెక్కడే పెట్టుకుని ఉండు. అంత పెద్ద వర్షంవస్తే కాన్వాస్ వేసి నువ్విక్కడే కార్లోనే ఉండు....!"

వెంకటాద్రి తలూపాడు!

ఏటవాలుగా, పడవమీదనుంచి మెట్టుమీదికి వేసిన చెక్కమీదుగా జాగ్రత్తగా పడవలోకి ఎక్కాము.

"ఛ....ఛ.... ఇదేమిటోయ్ డర్టీ! లోపలంతా ఈ నీళ్ళు?" అసహ్యంగా ముఖంపెట్టాడు నాగభూషణం. యువకులలో ఒకడొచ్చి, తలగుడ్డతో అడ్డుచెక్క శుభ్రంగా తుడిచాడు. నాగభూషణం, నేనూ పక్క పక్కన్నే కూర్చు న్నాం. మోకులకున్న ఇనుప దిమ్మెలు తీసేశారు. యువకు లిద్దరూ చెరో పెద్ద గెడ పుచ్చుకున్నారు. వృద్ధుడు వెళ్ళి చుక్కాని దగ్గర కూర్చున్నాడు. మెల్లిగా సాగుతోంది పడవ! మబ్బుపట్టి ఉన్నందువల్ల చల్లగాఉంది వాతావరణం! మరో సమయంలో అయితే, ఇలాంటి పడవ ప్రయాణానికి నా మనస్సెంతగా ఉప్పొంగి పోయేదో? కానీ ఈ రోజు మన స్సంతా చికాకుగా కలచివేస్తోంది! అంతకంతకూ దట్టమౌ తున్నాయి మేఘాలు, ఏక్షణాన్నయినా కుండపోతగా వర్షం

కురిసేలా ఉంది. నాకేమిటో లోలోపల భయం వేస్తోంది. ఇంత కక్కుర్తిగా వెళ్తున్న ఈ ప్రయాణం పర్యవసానం ఏమిటి? పోని ఏదైనా శుభకార్యానికా అంటే అదీ కాదు! ఓ అమాయకుని ఆస్తి హఠాత్తుగా స్వాధీనం చేసుకోవటానికి! హఠాత్తుగా దిక్కులేని పరిస్థితులలో ఇరుక్కున్న ఆ అభాగ్యుణ్ణే చూస్తూ, నాగభూషణం కోడెత్రాచులా వికవిక నవ్వుతుంటే, ఆ అభాగ్యుని దుఃఖం చూడలేకా, అతగాడి భార్యాబిడ్డల దయనీయ స్థితి ఊహించుకోలేకా. నా యజమాని అయిన దోషానికి....నాగభూషణం నవ్వులో నేనూ శృతి కలపక తప్పని దురదృష్టానికి, నా హృదయం తల్లడిల్లి పోతోంది?

ఆ అభాగ్యుడెవరో కాదు! నా క్లాస్ మేట్ శేషగిరి! ఆ మాటకొస్తే నేనూ, శేషగిరి, నాగభూషణం, ముగ్గురమూ క్లాస్ మేట్స్‌మే! బి. ఏ పూర్తి అయిందనిపించిన నాగభూషణం విలాసాలూ, విలాసినులతో, కాలుమీద కాలు వేసు కూర్చున్నాడు! పొట్ట గడవని నేను, నాగభూషణం ఆస్తిపాస్తులు అజమాయిషీ చేస్తూ, అతగాడి దగ్గరే, మేనేజరుగా చేరాను! తండ్రి మరణంతో, కుటుంబానికి మరి మగదక్షత లేని శేషగిరి ఆ 'లంక' లో స్వంత వ్యవసాయం చూచుకుంటూ స్థిరపడి పోయాడు!

కాలేజీలో చదువుకునే రోజుల్లో, ఆ కాలేజీలోనే ఇంటర్ చదువుతూండిన రాజేశ్వరి మీద పడింది నాగభూషణం చూపు. చేతికి చిక్కిన పువ్వును నలిపి గిరాటు

వెయ్యటంతప్ప, సున్నితంగా చూచి, గౌరవించే స్వభావం లేని నాగభూషణాన్ని ఏవగించుకునేది రాజేశ్వరి !

అనుకోకుండా, రాజేశ్వరి కుటుంబ పరిస్థితులు అనుకూలించక పోవటంతో, చదువుకు స్వస్తి చెప్పింది. శేషగిరిని కోరి పెళ్ళాడింది ! అది మొదలూ నాగభూషణంలో శేషగిరిమీద సన్నని ఈర్ష్యా జ్వాలలేగి, అప్పుడప్పుడూ ఆమంటకతగాడు తట్టుకోలేక విలవిలలాడి పోయేవాడు !

ఆ బాధలోనే నాతో "ఏమోయ్ శ్రీనివాస్ ! నా కంటే గొప్పతనం ఏం చూసింది శేషగిరిలో రాజేశ్వరి ?" అనేవాడు !

నా మౌనమే జవాబుగా దొరకటంతో మళ్ళీ తనే అనేవాడు...."చూస్తుండు శ్రీనివాస్ ఏ రోజో, నా చేతిలో శేషగిరి చిక్కే అవకాశం రాకపోదు ! ఆనాడు రాజేశ్వరి కళ్ళు తెరిపిస్తాను! తన పొరబాటు తెలిసివచ్చేలా నిరూపిస్తాను. ఆ రోజు....ఆ రోజు...." ఇక కోపంతో మాట్లాడలేక పోయేవాడు నాగభూషణం.

అలాటి పాపిష్టిరోజు రాకూడదనే మనసా వాంఛించే వాడిని ! కానీ ఆ రోజు విధివశాత్తూ రానే వచ్చింది !

పంటలు సరిగాలేక, ఆర్థిక చిక్కుల్లో పడిన శేషగిరి ఓ రోజు రాత్రి నాదగ్గరకు వచ్చాడు, నాలుగువేల రూపాయలు అప్పుగా కావాలంటూ ! నాకా సమయంలో తల తెగ నరుక్కోవాలని పించింది సాధారణంగా, ఇతరుల దగ్గరకు

'దేహి' అని వెళ్ళటానికిముందు మనిషి సగంచచ్చిపోతాడు. అందులోను శేషగిరి లాటి ఆత్మాభిమాని, అది ఆత్మ హత్యలా భావిస్తాడుకూడా! అలాటి శేషగిరికి ఆపదలో సాయంచేయడానికి నా దగ్గర నాలుగువేలు కాదుగదా, కనీసం నాలుగువందలయినా లేవు! క్షణంసేపు ఆలోచించి ఇంట్లోంకి వెళ్ళాను. ఐదు నిముషాల తర్వాత శేషగిరితో "శేషగిరీ ఇవిగో ఇవి అమ్మికొంత అప్పుతీర్చు! నా దగ్గరున్న వివే! అన్నాను." ఒక పేట గొలుసు, ఒకజతగాజులు, ఒక ఉంగరం!

నా దోసిలిలో వున్న నా భార్య నగల వేపాకసారీ, నావేపాకసారీ చూశాడు శేషగిరి! చటుక్కున నన్ను కౌగలించు కున్నాడు.

"శీనూ! నువ్వు నాలుగువేలు ఇవ్వకున్నా ఫర్వాలేదు. నీ పరిస్థితి నాకు తెల్సు. నీలో నామీదున్న స్నేహానికీ, ప్రేమకూ నిజంగా గర్విస్తున్నాను. చివరకు చెల్లెమ్మ సొమ్ము నాకిస్తావా? వద్దు....శీనూ! హేళన చేస్తున్నాననుకోకు. ఇదమ్మినా అప్పు పూర్తిగా తీరదెలాగూ! మరెక్కడేనా ప్రయత్నం చేసుకుంటాలే!"

తెల్లవారేసరి కీ సంగతి నాగభూషణానికెలా తెల్సిందో, నాకు కబురంపాడు, శేషగిరిని పిల్చుకు రమ్మని. ఇద్దరం వెళ్ళాము,

సాదరంగా ఆహ్వానించి, అప్పుసంగతి కదలేశాడు. శేషగిరి నిజం చెప్పాడు.

"అప్పులాళ్ళను నాదగ్గరకు పంపించు శేషగిరీ! నేను సర్దుబాటు చేస్తాను!" అన్నాడు హుందాగా నాగభూషణం!

నా చెవుల్నీ, కళ్ళనీ నమ్మలేకపోయాను, క్షణకాలం. కృతజ్ఞతలు చెప్పుకొని శేషగిరి వెళ్ళిపోయాడు.

మర్నాడే నాగభూషణం శేషగిరి అప్పులన్నీ తీర్చేశాడు.... కాని శేషగిరి ఆస్తంతా తనపేరిట వ్రాయించుకున్నాడు, నాలుగేళ్ళలో తనకు అప్పుతీర్చి, ఆస్తి తిరిగి పుచ్చుకునేలా!

ఆ క్షణంలో నా హృదయం ఏదో అపశ్రుతి పలికింది! నాగభూషణం ఎందుకింత ఉదారంగా మారాడు? అనే భావన పదేపదే రాసాగింది. మెల్లిగా రోజులు గడిచేకొద్దీ, ఆ సంగతే మరుగునపడి పోయింది....

సరిగ్గా నిన్న సాయంత్రం నాగభూషణం నాతో అన్నాడు. "శ్రీనివాస్! రేపు శేషగిరివుండే లంకకు వెళ్ళాలి మనం! తయారుగా వుండు!" అని. ఆశ్చర్యపోయాను! "ఎందుకూ?" విస్మయంగా అడిగాను? "గుర్తులేదూ. నాలుగేళ్ళుదాటింది. వడ్డీమాత్రం చెల్లించాడు శేషగిరి. అసలు అలాగేవుందిగా? ఆస్తి జప్తు చేయిస్తాను...."నాగభూషణం విరగబడి నవ్వాడు. నా కాళ్ళక్రింది భూమి కదులుతున్నట్లు అనిపించిందా క్షణంలో! "ఏరోజో శేషగిరి నా చేతిలోంచి కే అవకాశం రాకపోదు...." నాగభూషణం పలికిన మాటలు గతంలోంచి మెల్లిగా నా చెవులలో ప్రతిధ్వనిస్తున్నాయి.

"మరి మీతోబాటు నే నెందుకూ?" ఆ దుర్భర దృశ్యం నే చూడలేనని పించింది.

"ఓహో! నువ్వు లేకుండానా? ఊహుఁ కుదరదు!" ఏదో ఆలోచిస్తూ అన్నాడు నాగభూషణం—ఈ సరికి కోర్టు అమీనా, లాయరు అక్కడికి చేరే ఉంటారు....!"

"పోనీ మరో ఆరునెలల టైమిద్దాం....!" నాన్చాను. ఎందరో బాకీదారుల విషయంలో ఇలా గడువు ఇచ్చి వసూలు చెయ్యటం నాకూ, నాగభూషణానికీ కూడా అలవాటే!

"కుదరదు!" నిక్కచ్చిగా చెప్పి వెళ్ళిపోయాడు నాగభూషణం! మ్రాన్పడి నిల్చుండి పోయాను. కనీసం శేషగిరికి మేం వస్తున్నట్లు ఉత్తరం వ్రాసే వ్యవధికూడా ఇవ్వలేదు నాగభూషణం! రేపు హఠాత్తుగా మేం వెళ్ళి శేషగిరి ఇల్లూ పొలమూ జప్తుచేస్తే....? ఆ దృశ్యం దుర్భరంగా, దుస్సహంగా హృదయ ఫలకం మీద పదేపదే కన్పించసాగింది! గట్టిగా కళ్ళు మూసుకున్నాను. నాగభూషణాన్ని ఎన్ని శాపనార్థాలు పెట్టిందో నా హృదయం. నాకే తెలుసు! ఈ పాపకార్యంలో నా సాయంకూడా ఎందుకో?

తలబ్రద్దలౌతుంటే, ఇంటికి వచ్చేసాను.

* * * *

టపటప రాలుతున్న చినుకులతో ఆలోచనల మత్తు వదిలింది....ప్రవాహానికి ఎదురుగా వెడ్తోంది పడవ! యువకులిద్దరూ బలంగా గడలు నీటిలో అదిమిపట్టి చెరోవేపు పడవ

అంచులమీద పడవ కెదురుగా నరుస్తున్నారు. అంత త్వరగా నడుస్తున్నవాళ్లు జారిపడ్తారేమో నన్న అనుమానం క్షణ కాలం మదిలో మెదిలి మాయమయ్యింది. చుక్కాని దగ్గరున్న తాతమాత్రం, నాగభూషణంతో ఏదో ముచ్చట చెబుతున్నాడు.

"సరిగ్గా ఇట్లాగే చినుకులు మొదలెట్టాయి దొరా! అచేం దురుబుద్ధో, ఎన్నడూ లేంది, నాయింటిదికూడా సేపల వేట కొత్తానని గోల మొదలెట్టింది, సర్లెమ్మని తీసికెళ్ళాను. పడవ నిండా ఎక్కాం.... ఏటకోసం వలలెట్టుకుని.... సూత్తుండగానే తుంపర మొదలెట్టింది. అంతే! పడవదారి పడవదైంది! దభీ మని మునిగింది. అంతా ఇరవై మంగిదా కున్నాందొరా...." ఆయాసంతో కాబోలు క్షణం ఆగాడు తాత.

నాకేమిటో ఈ సమయంలో తాత చెబుతున్న ఆ కథ భయంతో రోమాంచితుణ్ణి చేసింది! సర్దు కూర్చున్నాను. గెడ వేస్తున్న యువకుల మెలిదిరిగిన కండగాలు మరింత స్పష్టంగా కన్పిస్తున్నాయి....

"ఊఁ! తర్వాత?" రెయిన్ కోటు సర్దుకుని హేటు బాగా ముఖంమీదకు లాక్కుని అడిగాడు నాగభూషణం. నాకు వినాలని లేదు.... కానీ తాత ఖంగుమనే గొంతు వద్దన్నా వినిపిస్తోంది.

"ఇంకేటుంది బాబూ! అంతా మునిగి పోనారు! నేనూ, నా జతగాడొకడు మాత్రం బతికి బయటపడాం .... నాయింటిది

కూడా పోయింది....” పడవను ఓ వేపుకు మళ్ళించి మళ్ళీ సర్దు కున్నాడు తాత....

“అయ్యో పాపం ! పడవ నడిపే పనెందుకు తాతా ! వదిలెయ్యలేకపోయావ్” ? “హుందాగా అడిగాడు నాగ భూషణం. తాత కిలకిలనవ్వాడు....” భుగితి గడవొద్దుదొరా? పై..ం ఎప్పుడూ అట్టాగే జరుగుతుందా ? ఎవరి కేయూల, దేనిగుండా రాసిపెడితే, దానిగుండా వస్తుంది చావు....రోజూ ఇట్టా తిరుగుతూనే వుంటాం ! రోజూ పడవలు మునుగు తున్నాయా ? అంతెందుకు ? ఆ పడవలోనే గందా నేనూ వున్నాను ? మరి నేచావలేదేం ?”

ఎందుకో తాత చెబుతున్న మాటల మీాదకు నా మనస్సు పోయింది క్షణకాలం ! నాగభూషణం పలకలేదు.... తాత మళ్ళీ మెదలుపెట్టాడు....“రోజూ ఎందరెందరో దొరబాబులు కారులలో, రైళ్ళలో ఎడుతుంటారు....కొందరు ఆటి కిందపడీ, అవిపడీ చస్తుంటారుగందా ? అందరూ చస్తు న్నారా దొరా ?”

ఈ సారీ నాగభూషణం పలకలేదు. కానీ యాంత్రి కంగానే, నే తలూపాను ‘నిజం’ అన్నట్లు. తాత నావేపు తిరిగి మొదలెట్టాడు.... “అసలేదో అనుకుంటాం గానీ దొరా ! మనిసి పుట్టడంతోనే చత్తాడు దొరా !”

నాగభూషణం బిగ్గరగా నవ్వాడు “కొత్త సిద్ధాంతం కనిపెట్టావ్ తాతా !” అంటూ. వాన మెల్లిగా జల్లుగా మారుతోంది ! యువకులిద్దరూ పైనపు కాగితాలు నెత్తి

మీద వేసుకున్నారు. తాత తలగుడ్డే ముసుగుగా వేసుకున్నాడు నెత్తిన !

"కొత్త సిద్ధాంతం కాదుదొరా ! నిజమంతే ! మనిసి పుట్టి పెరుగుతున్నాననీ, తనేదో సేత్తున్నాననీ, అనుకుంటూంటాడు దొరా ! కానీ మనిషితో బాటే కాలం అతడి ఎనకే పరుగెత్తుకొస్తా, అతడి ఆయుస్సు మింగుతానే వుంటాది దొరా ! పూర్తిగా కాలం మింగేసిన నాడు చచ్చాడని మనం ఏడుస్తాం ! కానీ కాలం మనిసిని మింగేత్తూనే వుంటా దెప్పుడూ !"

కొద్దిగా అర్థం కాలేదనిపించినా, నింపాదిగా ఆలోచిస్తే, తాత చెప్పేది భాషా భేదమయినా, భావం నిజమే అనిపించింది....

నాగభూషణానికిక తాత ముచ్చట వినే ఓపిక లేకపోయింది....

"ఓహ్ ! జిడ్డూ !" అన్నాడు గొణుగుతూ.

నేను పలకలేదు....తాత చెప్పినదాన్ని గురించి ఆలోచిస్తున్నాను.

"నాకళ్ళముందు భిక్షమెత్తుకునేలా చేసి, వాడు అడుక్కుంటుంటే చూసి ఆనందిస్తాను !" స్వగతంలా అంటున్న నాగభూషణం మాటలకు ఉలిక్కిపడ్డాను.

ప్రవాహం ఉధృతమౌతోంది ! బాగా లోతు నీళ్ళలోకి వచ్చింది పడవ ! చినుకులు పెద్దవై హోరున వర్షం

మొదలైంది! గెడలు బలంగా పూనిపట్టి వడివడిగా నడుస్తున్నారు యువకులు! చూస్తుండగానే పరిసరంకన్పించనంతటి ప్రళయవానగా మారింది! నాలో ఏమిటో భీతి ఆవహిస్తోంది.

"ఛస్! పాడువాన!" ముఖం మీదికిబాగా హేట్ లాక్కుని విసుక్కున్నాడు నాగభూషణం! నాకేమిటో సంతోషం కలుగుతోంది! నాగభూషణం చెయ్యబోతున్న కిరాతకపు పనిని ప్రకృతికూడా గ్రహిస్తోందనిపించింది. తాత అనుభవంలానే. ఈ రోజుకూడా మేమున్న ఈ పడవ తలక్రిందులైతే? నాగభూషణం, నేనూ చనిపోతే? శేషగిరిని కాళ్ళక్రింద త్రొక్కి వేద్దామనుకుంటున్న నాగభూషణం చనిపోతాడు. ఆ దిక్కుమాలిన పనిలో, నాగభూషణానికి సాయంగా వ్రాతలు జరిపించాల్సిన నేనూ - హాయిగా తృప్తిగా చనిపోతాను!

ఏమిటో ఇలా ఉక్కిరి బిక్కిరౌతోంది హృదయం. ఆ యువకులిద్దరిలో ఒకడు పెద్దగానే గొణుగుతున్నాడు. "నేనూ ఇంటికాడే సెప్పానా? డబ్బుగ్గడితిని పడవ నీలల్లో కొదలొద్దనీ?" తాత బుస్సుమన్నాడు "ఇప్పుడేమయింది రా ఎదవా? ఎదురెల్లటం పడదనుకుంటే - అప్పుడే వాలుకు తిప్పుదాం! తెరచాపిడుద్దాం....ఆనక వాన సరుదుకున్నాక ఎదురెల్లాం!"

సంభాషణ జరుగుతూండగానే, రెండుమూర్లు నీటిఅంచు మీదికి అటూ ఇటూ ఒరిగింది పడవ! గబుక్కున నాచెయ్యి

గట్టిగా పట్టుకున్నాడు నాగభూషణం!, అతగాడి కళ్ళల్లో ఏదో భీతి గూడు కట్టుకుని వుండటం స్పష్టంగా కనిపించింది నాకు.

"పడవ వాలు తిప్పమందామా!" అన్నాను.... అప్పటికే పడవలో నీళ్లు నిలచి, నా కాళ్ళ మడమల వరకూ వచ్చాయి!

ఆ కళ్ళల్లో భీతిమాయమై, మళ్ళీ క్రౌర్యం వచ్చింది. "ఊహుఁ!" అన్నాడు బింకంగా!

హఠాత్తుగా ఓ పెద్ద వూపు వూపి నట్లయ్యింది........ మరు నిముషంలో నా చేతులు, కాళ్ళు, యాంత్రికంగా ఈత కొట్టడం ప్రారంభించాయి! ఆ అయోమయ పరిస్థితి దాటి నాకు బాగా తెలిసేసరికి, తెరచాప వదలి, శరవేగంతో వాలుకు పోతోంది పడవ! నీటిముద్దయి, చుక్కాని దగ్గర తాత కూర్చుని వున్నాడు. యువకులిద్దరూ నాదగ్గరే కూర్చుని వున్నారు. హోరువాన తగ్గి సన్నతుంపర పడ్తోంది.

"ఏమైంది?.... నాగభూషణం ఏడీ?" దాదాపు అరిచాను.

"అదుగో!" ఓ యువకుడు నాకాస్త దూరంలో పడవ మధ్యలో క్రింద పడుకునివున్న నాగభూషణం వేపు చూపించాడు. పాపం! 'డర్టీ' అంటూ అసహ్యించుకున్న ఆ పడవ అడుగులోనే అతగాడు స్పృహతప్పి పడివుండటం చూస్తే జాలనిపించింది! క్షణంలో జరిగిందేమిటో బోధ పడింది! పడవ ఒక్కసారి బోర్లాపడి, తిరిగి మామూలు

స్థితికి వచ్చింది. ఈత బాగా వచ్చిన వాణ్ణవటంవల్ల మళ్ళీ పడవను నేను అందుకో గలిగాను ! తాత యువకులతో ! పాపం ! నాగభూషణం ఆ షాక్ కు స్పృహ తప్పాడేమో ?

“నాగభూషణం !” హోదాలు, అంతస్తులూ, మరచి పిలిచాను. “ఆ బాబిక పలుకడు బాబూ ! చచ్చిపోయాడు !” తాత మాటలు పిడుగుల్లా నెత్తిన పడ్డాయి ! కళ్ళప్పగించి చూశాను. నాగభూషణం ముఖంలో, తెరచివున్న అతగాడి కళ్ళల్లో జీవకళ, జీవజ్యోతి లేవు !

“నాగభూషణం ! వెర్రి కేకపెట్టి గట్టిగా ఏడ్చాను ! అందాకా మూలమూలల దాక్కునివున్న ఎన్నో అరమరలన్నీ ఒక్కసారిగా ఎగిరిపోయాయి ! భగవాన్ చివరకు ఎలాటి దుస్సంఘటన జరిగి పోయింది ?

“పడటంలోనే పడవ అడుక్కెల్లా రాబాబూ పాపం ! మీరు పడవలోకొచ్చి పడ్డారు. ఆబాబు రాలేక పోయారు. మళ్ళీ పడవ సరిగా తిరగే సరికి- తిరిగి పడవ కిందికే ఎల్లారు ! నేనూ, వాళ్ళూ పైకి లాగేసరికి పానం పోయింది !” తాత చెబుతున్నాడు !

నాకు దిక్కు తోచటంలేదు. కష్టతో మొదలైన ఈ ప్రయాణం నాగభూషణం మరణంతో అంతమయిందా ? ఒక పడవలో వెళ్తున్న మేమందరం బ్రతికి బయట పడ్డాం. కాని నాగభూషణం మృత్యువు వాత పడ్డాడు. ఇంటిదగ్గరున్న అతగాడి భార్యకు నేనేమని సమాధానం చెప్పను ? దుఃఖం ముంచుక వస్తోంది ! పడవలో కూర్చుని శేషగిరిమీద సాను

భూతితో, నాగభూషణం మీంది కోపంతో, నేనూ కసిగా కోరుకున్న కోరిక కిదా ఫలితం ? అదే నిజమైతే మరి నేను ఎందుకు చని పోలేదు ?

"ఊరుకో బాబూ ! తేరుకో ! దొరను జాగ్ర త్తగా ఇంటికి చేర్చు ! పాపం ! ఎన్నెన్ని ఆలోచన్లు చేసి ఈ పడ వెక్కాడో ఆదొర ! ఆయుస్సె మింగుడు పడి పోవటం ఎవరి కెరుక ?"

వెర్రిగా తాత వేపు చూశాను !

"ఇట్టాంటి సావును చూడటం కొత్తగావాలు బాబూ నీకు ! అందుకే అంతగా గాబరాపడ్తుండవ్ !

కాలం అందర్నీ ఇట్టాగే మింగుతాది బాబూ ! ఎప్పుడో ఒకనాడు ఏదోయిధంగా, మనందరం దాని పొట్టలోకి పోయే ఓళ్ళమే ! కాత్త ఎనకా, ముందూ, అంతే ! ఈ దొరలానే మనమూ మన్నులో కలిసేఓల్లమే !

నా ఇంటిది మునిగిపోయిందిగానీ, నే పోగలిగానా బాబూ ఆనాడు ! మన పిచ్చిగానీ- మనవంతా ఓసారి పుట్టామా- కలిసి ఎల్ల టానికి ? కాలంమింగే దానికి మనమేటి సేత్తాం బాబూ ?

అది కానుకోలేక ఎటేటో ఆలోచన సేత్తారు వెర్రి జనం ! ఎంతున్నా సాలదని మొత్తుకుంటూరు. ఈ దొర సూడు! ఆయన్నె వర్నో కాలికిందేసి రాసేత్తా నంటూ పెగ్గలు పలుకు తూనే వుండే.... కాలం ఈ దొరనే పొట్టనేసుకుంది !"

చుక్కాని తాత మాటలు మహాత్మునికి బోధలా అనిపిస్తోంది నాకు! మృత్యు శీతలచ్ఛాయతో బిగుసుకుని వున్న నాశరీరానికి తాత మాటలు వెచ్చగా తగుల్తున్నాయి! తాత కాలపురుషునికి మారు రూపంలా కనిపిస్తున్నాడు నాకళ్ళకు.

కారుతున్న కన్నీళ్ళు తక్కున ఆగిపోయాయి. పడవ యువకులు సాయంపట్టి నాగభూషణం కళేబరాన్ని కారులో పడుకోబెట్టారు! విస్మయంగా కారుచుట్టూ మూగిన జనం రకరకాల వ్యాఖ్యానాలు చేస్తున్నారు!

"అట్టా బీతు పడకుబాబూ! దెయిర్యం తెచ్చుకో!" మళ్ళీ తాత హెచ్చరించాడు-నాగభూషణం నిర్జీవ కళేబరం తలవేపుకూర్చునివున్న నన్ను చూస్తూ!

వెంకటాద్రి భోరున ఏడ్చి, మెల్లిగా సంబాళించు కుంటున్నాడు.

"కారు పోనియ్ వెంకటాద్రీ!" మెల్లిగాఅన్నాను. ఇక అక్కడ ఆలస్యం చేసేకొద్దీ, జనం ఎక్కువయ్యేలావున్నారు.

కారు స్టీరింగ్ ముందు కూర్చున్నాడు వెంకటాద్రి కళ్ళు తుడుచుకుని. తాత మాటలు చెవుల్లో ప్రతి ధ్వనిస్తున్నాయి.

"కాలం అందర్నీ మింగేత్తా వుంటాదిబాబూ? కాలంమింగేదానికి మనమేటిసేత్తాం?"

ఏదోగాని నిర్లిప్తత ఆవరించిది హృదయాన్ని ! నిజమే! కాలం మనిషి వెనకాలే పరుగెడ్తోంది ! అతగాణ్ణి కబళిస్తోంది! ఏదో ఓరూపంలో, ఎప్పుడో ఒకప్పుడు, ప్రతి జీవినీ కాలం కబళిస్తూనే వుంటుంది !

కారు కదిలింది ! మెల్లిగా కళ్ళు మూసుకుని, ఏ భావ సంచలనం లేని స్థిరమైన మనస్సుతో సీటుకు చేరగిలబడ్డాను.

( "జయశ్రీ" అక్టోబరు 67 )